# మైనమ్మ దేవత

పవన్ కుమార్

'మైనమ్మ జాతర ఎల్లుండి.'

అప్పుడే వచ్చి కూర్చున్న భర్తకు అన్నం పెడుతూ చెప్పింది లక్ష్మమ్మ.

ఆకలితో వున్నట్లున్నాడు రాఘవయ్య, భార్య మాటలు వినిపించుకోకుండా గబగబా తింటున్నాడు.

'అంత తొందరేమొచ్చింది, మెల్లగా తినరాదు.'

భార్య మాటలిన్నాడో లేదో గాని, గబగబ తినటం మానివేసి గ్లాసుడు మంచి నీళ్ళు త్రాగినాడు.

లక్ష్మమ్మ భర్తకు ఎన్నో సంగతులు చెబుదామనుకున్నది గాని, భర్త తొందరగా భోజనం చేయటం చూచి మెదలకుండా గడపమీద కూర్చుని కావలసింది వడ్డించటం మొదలు పెట్టింది. మజ్జిగపోస్తూ మళ్ళీ మైనమ్మ జాతర గుర్తుకు తెచ్చింది.

రాఘవయ్య తలూపాడు గుర్తుకు వచ్చినట్లుగా.

'సాయంత్రము రమ్మని నాగరాజుకు కబురు పంపుతాను' భర్తకు తాంబూలమిస్తూ చెప్పింది.

భార్య యిచ్చిన తాంబూలం నోట్లో వేసుకుంటూ 'మళ్లీ నాకోసం చూడటం దేనికి, అతనికిచ్చేవి యిచ్చి, అమ్మవారి దగ్గర చెయ్యవలసిన యేర్పాట్లు చెయ్యమని చెప్పు' దండెంమీద పంచెను భుజం మీద వేసుకుని వాకిట్లోకి వెళ్లిపోయినాడు.

ప్రతి సంవత్సరము జాతరకు నాలుగు రోజులు ముందరనుంచే అన్ని పనులు అవతలకునెట్టి, స్వయంగా గుడి దగ్గర పనులు చేయించే భర్త, ఈ యేడు ఆ బాధ్యతనంతా తనపై పెట్టేటప్పటికి లక్ష్మమ్మ ఆశ్చర్యపోయింది. 'కలికాలం వచ్చింది, ఎన్నికలు వస్తున్నాయిట, పార్టీ గొడవల్లో తిరుగుతూ, కులదేవతనే మర్చిపోయినారు' అంటూ లక్ష్మమ్మ వాకిట్లోకి వెళ్లిన భర్తను చూస్తూ నిల్చుంది.

* * *

మైనమ్మ జాతర గూర్చి ఆ గ్రామంలోను, చుట్టుప్రక్కల గ్రామాలువారికి తప్ప బయటప్రపంచానికి నామ మాత్రంగా గూడ తెలియదు. ఆంధ్రదేశంలో ప్రతి గ్రామంలోను ఏదో నామంతో గ్రామదేవతలు కొలవబడుతుంటారు. అక్కడ ప్రతిరోజు పూజలు జరగవు. ఒక్క జాతర రోజున మాత్రమే భక్తులు తమ కానుకలను, ముడుపులను అర్పించుకుంటారు.

మైనమ్మ గుడి ఊరిబయట తుమ్మ చెట్ల మధ్య వంటరిగా నిలబడి వున్నది. జాతర రేపనగా, గుడి పెద్ద వూరిలోని రంగులువేసేవానిని పిల్చి, క్రొత్త గుడ్డలు పెట్టి, బియ్యం, పప్పు, ఉప్పు మొదలగు సామానుయిచ్చి, అమ్మవారి ద్వారానికి అడ్డంగా కట్టటానికి ఒక పట్టు తెరను యిస్తారు. సంప్రదాయానుసారము అమ్మవారికి రంగులువేసి, అచ్చట జరగవలసిన కార్యము జరుపవలసిందిగా కోరతాడు కుల పెద్ద. అందుకు సమ్మతించినట్లుగా ఒక్క తాంబూలం మాత్రమే అక్కడ వేసుకొని, వస్తువులు తనవెంట తీసుకువెళ్తాడు.

అమ్మవారికి రంగువేసేరోజున కుమ్మరి చాలా మడి ఆచారములతో ఉండవలెను. మద్యము కాని మరేది ముట్టకూడదు. ఊరు మాటుమణిగిన తరువాత ఊరి బావి దగ్గిర స్నానంచేసి, గుడి పెద్ద యిచ్చిన

క్రొత్త గుడ్డలు కట్టుకొని, పెట్రోమాక్సు దీపం తీసుకొని వంటరిగా గుడి దగ్గరకు వెళతాడు. ఆ సమయములో పెద్దలు కాని, పిల్లలు గాని ఎదురు రాకూడదు. అందుకు తగిన యేర్పాట్లు ఊరి పెద్దలు చేస్తారు.

రాత్రిపూట వంటరిగా ఆ ప్రదేశానికి పోవటానికి దడుస్తారు గాని, ఆ రోజు మాత్రము కుమ్మరి, ఏ విధమైన జంకు గొంకులు లేకుండా ముందుకు సాగిపోయి, నిశ్శబ్దం తాండవిస్తున్న ఆ గుడి ముందర దీపం పెట్టగానే, ఆ వెలుతురికి గబ్బిళాలు ఒక్కసారి కిచ కిచ మంటూ గోలచేస్తాయి. నామ మాత్రంగా చెక్క తలుపులకు చుట్టిన తీగెను తొలగించి లోపలికి అడుగు పెట్టగానే గబ్బిళాలు ముఖంనిండా కప్పివేస్తాయి.

* * *

ఇంటినుండి బయలుదేరిన రాఘవయ్య మునసబుగారితో మాట్లాడి పొలానికి వెళదామని రోడ్డు మలుపు తిరిగేసరికి ఎదురుగా హైస్కూలు హెడ్‌మాష్టరుగారు దర్శనమిచ్చారు. ఆయనతోపాటు ఒక యువతికూడ వున్నది. రాఘవయ్యను చూడగానే మాష్టరుగారు 'నమస్కారం' అంటూ చేతులు జోడించారు. రాఘవయ్యకూడ ప్రతి నమస్కారంచేస్తూ ప్రక్కనామె ఎవరన్నట్లు చూచాడు. 'క్రొత్తగా మన స్కూలుకు వచ్చిన టీచరుగారు' అంటూ ఆమెను పరిచయము చేసినాడు. ఆమెకుకూడ రాఘవయ్య నమస్కారంచేస్తూ 'ప్రస్తుతము ఎక్కడ వుంటున్నారని' ప్రశ్నించాడు. 'రాజుగారి యిల్లు చూపించుదామని తీసుకెళుతున్నాను' వెంటనే పంతులుగారు సమాధానమిచ్చారు. పనుందని రాఘవయ్య ముందుకు సాగిపోయినాడు.

దారి పొడుగునా హెడ్‌మాష్టరుగారు, రాఘవయ్య స్థితిగతులు, మంచి చెడ్డలను గూర్చి క్రొత్తగా వచ్చిన పంతులమ్మగారికి చెప్పుకుంటూ నడక సాగించాడు.

* * *

రాఘవయ్య పొలం చేరేసరికి, వీరాయి గొడ్లకు పచ్చిగడ్డి కోస్తున్నాడు కాబోలు, దొరను చూడగానె 'దణ్ణం బాబు' అంటూ చేతులు కట్టుకొనివచ్చి నిలబడ్డాడు.

దగ్గిరలోనేవున్న నూతి గట్టుపై కూర్చుని జేబులోంచి పొగాకుపాయ ఒకటి తీసి చుట్ట చుట్టటం మొదలుపెట్టినాడు.

యెప్పుడూ వస్తాడని వెళ్ళి వీరాయి కోసిన గడ్డిని మోపుకట్టి, గొడ్లకేసే కుర్రాడినెత్తినబెట్టి తిరిగివచ్చి దొరకు దగ్గరగా కూర్చున్నాడు.

వాడితో కాసేపు పొలం విషయాలు, పైరుసంగతులు మాట్లాడుతూ కూర్చున్నాడు. చాలా కాలానికి పొలంమీదకు వచ్చిన దొరనుచూచి వీరాయి సంతోషంగా అన్నిటికి సమాధాన మిస్తున్నాడు. పొగాకు మంచిది కానట్లుంది చుట్ట బాగా కాలలేదు. దూరంగా విసిరివేసాడు.

'చొప్పమ్మ దగ్గర మంచి సరుకు వుందిరా?' రాఘవయ్య ఏదో ఆలోచిస్తున్న వీరాయిని ప్రశ్నించాడు:

'వున్నదనుకుంటాను దొర, ఇప్పుడు అక్కడనుండి దుకాణంతీసి తూర్పువైపున మన వాములదగ్గర పెట్టింది దొర.'

'అక్కడ బాగా సాగటంలేదా ?'

'ఏమోదొర, ఈ మధ్య పోలీసోళ్ళ గోడవ ఎక్కువయి పోయింది దొర. అది గాక రాజుగారేమో అక్కడనుండి తీయకపోతే పోలీసు రిపోర్టు యిస్తానని చెప్పినారుట.'

రాజుగారిపేరు వినగానే దారిలో హెడ్ మాష్టరుగారి ప్రక్కనున్న అమ్మాయి గుర్తుకొచ్చింది.

'రాజుగారియింట్లో ఇదివరకున్న కాలువ గుమాస్తా ఖాళీ చేసాడేమిరా' నొప్పి పుట్టినట్లున్నాయి కాలు బార జాపినాడు రాఘవయ్య.

'అవుననుకుంటాను దొర, ఈ మధ్య బండిమీద సామాను తీసుకొనివెళ్ళటం చూచాను. అక్కడ ఎవరో పంతులమ్మ వస్తుందని విన్నాను.'

రాఘవయ్య మొఖంమీద కాస్త చిరునవ్వు తెచ్చుకుంటు 'అమ్మాయి బాగుంటుందను కుంటాను.'

'ఏమోదొర ! నేను చూడలేదు. అది గాక ఈ రోజు ఆడపిల్లలు అందంగానే వుంటారు దొర' తనకుకూడ ప్రపంచ జ్ఞానం తెలుసునన్నట్లుగా రాఘవయ్యవంక చూచాడు వీరాయి.

రాఘవయ్య ఏదో గుర్తుకు వచ్చినట్లు 'రాజుగారి యింట్లో మీ ఆడదేగదా పని చేసేది, దానిద్వారా కదిలించు. పిట్టేమన్న పడుతుందేమో'

పచ్చిగడ్డి మొక్క పీకుతున్న వీరాయి తల ఎత్తకుండానే 'చిత్తం దొర' అంటూ మెదలకుండా తనపని చేయసాగాడు.

వీరాయి ఒక్క జీతగాడి క్రిందనేగాక రాఘవయ్యకు ఇతర విషయాల్లోకూడ సహాయపడ్తాడు. ముఖ్యంగా అవసరమైనప్పుడు ఆడవాళ్ళనుకూడ సరఫరాచేస్తూ తన స్వామిభక్తిని వెల్లడిస్తూ ఉంటాడు. చొప్పమ్మకూతురు పెద్దమనిషి అయిందని చెబుదామా ? వద్దా ? అని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

'మైనమ్మ పెద్దదయింది దొర'

రాఘవయ్య మైనమ్మ ఎవరో అర్థం కానట్లు ఎవర్రా? అంటూ ప్రశ్నించాడు.

'చొప్పమ్మ కూతురు దొర ?'

'అప్పుడే పెద్దదయిందా' ఆశ్చర్యాన్ని ప్రకటించి 'అయితే చొప్పమ్మ పంట పండిందన్నమాట' అంటూ లేచి నిలబడ్డాడు.

రాఘవయ్య లేవటంచూచి వీరాయి గూడ లేచి నిలబడ్డాడు.

'కాలువపైన బద్దవుందిరా?' భుజంపైన పంచెను సరిచేసుకుంటు అడిగాడు.

'మొన్ననే క్రొత్తది వేశాము దొర'

రాఘవయ్య మెదలకుండా నూతి గట్టుదిగి, కాలువపై బద్దెదాటి మెరక పొలం మీదగా వాముల దొడ్లవైపుకు సాగిపోయినాడు.

యజమాని కనుమరుగైనదాకా చూచి, వీరాయి కూడ చేలమధ్యగా తన గుడిసెవైపు సాగిపోయినాడు.

* * *

పడమర కొండల్లోకి సూర్యుడు విశ్రమిస్తున్నాడు. పొలానికివెళ్ళిన పశువుల మందలు తిరిగివస్తున్నాయి. వాటి వెనక నెత్తిన గడ్డిమోపులు పెట్టుకొని కుర్రాళ్ళు తొందర తొందరగా నడుస్తున్నారు. ఇంటి దగ్గరవున్న లేగదూడలు తల్లులకోసం అరుస్తున్నాయి.

దొడ్లో పనిచేసుకుంటున్న లక్ష్మమ్మ దూడలు అరుపునిని పశువులొస్తున్నాయని గ్రహించి దొడ్డితలుపులు తీసింది. తలుపులు తీసితీయటంతోనే పశువులన్ని ఒక్కసారి నీళ్ళతొట్లదగ్గరకు పరిగెత్తినాయి. వాటి వెనకనే రొప్పుకుంటూ కుర్రాడు గడ్డిమోపు నెత్తిన పెట్టుకువచ్చాడు. లక్ష్మమ్మ

పడినెత్తిమీద బరువుదించి, పశువులను కట్టివేయటం ప్రారంభించింది.

'అయ్యగారు పొలందగ్గర వున్నారమ్మగారు' పశువుల కుర్రాడు చెప్పింది విన్నదో లేదోగానీ లక్ష్మమ్మమాత్రము తలవంచుకొని దూడలనీ దూరంగా కట్టివేసి వచ్చింది.

కుర్రాడుపని అయిపోయింది వెళతా నన్నట్లుగా నెత్తిన పంచెతీసి దుమ్ము దులిపి భుజంపై వేసుకున్నాడు.

'నీవుపోయి నాగరాజుని పిల్చుకురా, గడ్డి నేవేస్తాలే' అంటూ లక్ష్మమ్మ కుర్రాడికి పని తగిలించింది.

నాగరాజా అంటే మొదట అర్థం కానట్లుంది. 'ఏ నాగరాజు అమ్మగారు' అంటూ ప్రశ్నించాడు.

'అదేరా ప్రతియేడు మైసమ్మకు రంగు వేయడు జయరాజు కొడుకు'

తెలుసన్నట్లు తలూపుకుంటూ కుర్రాడు వాకిట్లోకి పరిగెత్తాడు.

కుర్రాడు బయటకు వెళ్ళగానే దొడ్డి తలుపులువేసి, గొడ్ల ముందర గడ్డివేసి వంటపని చేసుకోటానికి యింట్లోకి వెళ్ళింది.

* * *

పొలం నుండి బయలుదేరిన రాఘవయ్య సరాసరి చొప్పమ్మ సారా దుకాణం దగ్గరకు చేరుకున్నాడు.

రాఘవయ్యను చూడగానే సారా డబ్బా ముందు కూర్చున్న చొప్పమ్మ 'దండం దొర! చాలా రోజులకు మాపై దయ

# మైసమ్మ దేవత

కలిగింది' అంటూ రెండు చేతులు జోడించింది నవ్వుతూ,

చిరునవ్వుతో 'వ్యాపారం బాగా సాగుతున్నట్లుందే, ఇక్కడికి మార్చావు.'

'మామూలుగానే వుందిదొరా, అక్కడ పోలీసోళ్ల గోల ఎక్కువయింది దొర.'

'వాళ్లకు మామూలు యివ్వటం లేదా.'

'యిస్తునే వున్నాను దొర, అదిగాక యింటికి కూడ దూరమైంది దొర.'

రాఘవయ్య చొప్పమ్మకు పది అడుగుల దూరంలో కూర్చుని, పాల డబ్బాలో పోసి యిచ్చిన సారాను రెండుమూడు డబ్బాలు పట్టించాడు.

మానవుడు ఎంత వింత పనులు చేస్తాడోకదా, ఊర్లో పెద్దమనిషిగా, సంఘ సంస్కర్తగా చెలామణి అవుతూ, ఊరికి దూరంగా పశువులు తినే గడ్డి వాముల మధ్య, కిరసనాయిలు డబ్బాలో నిల్వ ఉంచిన సారాను అమృతంలాగా సేవిస్తూ కబుర్లు చెబుతున్నాడంటే.

సాధ్యమైంతవరకు తెలుగుదేశంలో ఈ వ్యాపారాన్ని ఎక్కువగా ఆడవాళ్లు నడుపుతుంటారు. భర్త సారా బట్టీలతో కుస్తీ పడుతుంటే, భార్య చిరునవ్వులతో వచ్చిన వారికి కబుర్లు చెబుతూ, పాల డబ్బాలో మధువును పోసి అందిస్తుంది. ఖర్మకాలి ఒకవేళ భర్త కనుక జైల్లో కూర్చుంటే, భార్య దిగులు చింతా లేకుండా వ్యాపారం జాగ్రత్తగా నడుపుతూ భర్తకోసం ఎదురు చూస్తూ కాలం గడుపుతుంది.

ఇదే రకానికి చెందిన చొప్పమ్మ భర్త మాత్రము ఎప్పుడూ త్రాగి తందానాలు ఆడుతుంటే వాడి జీవాన వాడిని వదిలేసింది. పొరుగు ఊరిలోని బట్టీ దగ్గర నుండి రహస్యంగా సారా తెచ్చి యిక్కడ అమ్ముతూ ఒక్కగా నొక్క కూతురు కోసం ఈ పాడుపని చెయ్యాల్సి వచ్చిందని అప్పుడప్పుడు అనుకుంటూ వుంటుంది. ఒకటి రెండుసార్లు పోలీసులు పట్టుకొని కేసులు పెట్టారుగాని రాఘవయ్య జరిమానా చెల్లించి విడిపించుకొచ్చాడు.

'సరుకు ఎట్లావుంది దొర' పరధ్యాన్నంగా వున్న రాఘవయ్యను అడిగింది.

'సరుకుకేం బ్రహ్మాండంగా వుంది, ఒక్కదానివే వున్నావు మైనమ్మేది'?

'అమ్మాయి పెద్దదయింది 'దొర, అందుకని యింటి దగ్గరే వుంటుంది.'

రాఘవయ్య సూటిగా చొప్పమ్మ కళ్లలోకి చూస్తు 'మేం చూస్తే దిష్టి తగులుతుందా' అని అడిగాడు.

చొప్పమ్మ సిగ్గుపడుతూ 'పెద్దోళ్లు మీ దయ లేకుంటే ఎట్ల దొర.

చొప్పమ్మ మర్యాద యిచ్చినందుకు రాఘవయ్య సంతోషించాడు. ఇంకా మాట్లాడుదామని ప్రయత్నించాడుగాని, సరకుకోసం వచ్చేవాళ్లు ఎక్కువయినారు. కాసేపు కూర్చుని అక్కడనుండి మెల్లగా లేచి మునసబుగారింటికి బయలుదేరినాడు.

* * *

వంటింట్లో కూర్చున్న లక్ష్మమ్మకు ఎవరో వీధివాకిలి తీస్తున్న శబ్దం విన వచ్చింది. బహుశ భర్తవచ్చాడేమోనని మెదలకుండా వూరుకుంది.

'అమ్మగారు' అంటూ కుర్రాడుకేక వేసేసరికి చేస్తున్నపని వదలి బయటికి వచ్చింది.

'నాగరాజుగారు వస్తున్నారమ్మగారు' లక్ష్మమ్మను చూడగానే చెప్పి, యింటికి వెళతానన్నట్లుగా నిలబడినాడు.

అది గ్రహించిన లక్ష్మమ్మ వాణ్ణి పంపివేసి లోపలనుండి నాగరాజుకోసం కుర్చీ తెచ్చి వాకిట్లోవేసి గుమ్మంవంక చూస్తు నిల్చుంది.

'నమస్కారం' — అంటూ నాగరాజు



లోపలికిరాగానే, లక్ష్మమ్మ కూర్చోమని కుర్చీ చూపించి లోపలికి వెళ్ళింది.

ఈ సంవత్సరమే నాగరాజు అమ్మవారికి రంగువేయటం ప్రారంభము. ఇంతవరకు వాళ్ళతండ్రి వేసేవాడు. ఆయన చనిపోవటంతో పెద్దకుమారుడయిన నాగరాజు ఆ కార్యమునకు పూనుకోవలసి వచ్చింది.

కావలసిన వస్తువులన్నీ ఒక పళ్ళెంలో పెట్టి మరొక పళ్ళెంలో పట్టుతెర, క్రొత్తగుడ్డలుతెచ్చి నాగరాజు ముందర వుంచింది లక్ష్మమ్మ.

పాపం ! తండ్రి గుర్తుకు వచ్చాడు గాబోలు నాగరాజుకి ఒక్కసారి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినాయి

లక్ష్మమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ 'పెద్దవాళ్ళయిన తర్వాత ఏంచేస్తాం బాబూ! ధైర్యంగావుండి మనపెద్దలు మన మీదవుంచిన భారాన్ని ఎటువంటి అరమరికలులేకుండా నడపాలి బాబు'

అవునన్నట్లుగా తలూపుతూ వణికే చేతులతో తాంబూలం అందుకొని, బియ్యం, పప్పులు సంచిలో పోసుకొని 'వెళ్ళొస్తా' నంటూ గడపదిగినాడు

గడపదిగి వెళుతున్న నాగరాజునుచూస్తు లక్ష్మమ్మ అట్లాగే స్తంభాన్ని ఆనుకొని మైనమ్మనుగూర్చి ఆలోచిస్తున్నది.

'దాదాపు రెండు శతాబ్దముల క్రిందట రాఘవయ్య వంశములోని రామచంద్రయ్య, త్రాగిన మైకములో మైనమ్మనే కన్నెపిల్లను బలత్కరించాడు. రెండురోజుల క్రితమే ఆమె వివాహము బొమ్మలుచెక్కే మల్లయ్య రాజుతో నిశ్చయమై పోయింది. కామాంధుడైన రామచంద్రయ్యను మైనమ్మ ఎన్నోవిధాల బ్రతిమాలింది కాని, అవన్నీకూడ వ్యర్థమైపోగా, ఆమె ఊరిబయట చెరువులోబడి ఆత్మహత్య చేసుకుంది. తన శీలాన్ని చెరిచినందుకు శాపఫలితంగా రామచంద్రయ్య వంశము నామరూపాలు లేకుండా చేస్తానని ప్రతిన బూనింది. కాని అతని తల్లిదండ్రుల ప్రార్థనవలన శాంతించి, ఆ నాటినుండి కులదేవతయై వారిచేత ప్రతియేడు పూజ లందుకొనటం మొదలుపెట్టింది.

'అట్లా నుల్చున్నావు దేనికి' అంటూ భర్త లోపలికి వెళ్ళేసరికి లక్ష్మమ్మ తల వంచుకొని భర్త ననుసరించింది.

* * *


తలనొప్పిగా వుందా?

కాస్పిన్ మీకు వెంటనే ఉపశమన మిచ్చును



కాస్పిన్

మీకు తలనొప్పిగా వుంటే మీరు దిగాలుగా, చిరాకుగా, పనిమీద శ్రద్ధ లేకుండా వుంటారు. కాస్పిన్ వెంటనే మీ తలనొప్పి, అలసట తొలగించును. మీరు ఉత్సాహంగా, పనిచేయ తయారుగా వుండగలరు. ఇది పడిశమునకు, శరీర నొప్పులకు, పంటి నొప్పికి, చలిజ్వరానికి చాలా మంచిది. కాస్పిన్ మీ వద్ద యెప్పుడూ వుంచుకొనండి.

బెంగాల్ కెమికల్

కలకత్తా * బొంబాయి * కాన్పూరు * ఢిల్లీ

# మైనమ్మ దేవత

మరునాడు సంజవేళ నాగరాజు క్రమం తప్పకుండా స్నానంచేసి వంటరిగా లైటు తీసుకొని మైనమ్మ గుడివైపు బయలు దేరినాడు. ఊరు దూరమవుతున్న కొద్ది మైనమ్మగుడి దగ్గరవుతుంది. లైటు వెలుతురు పడటంతోనే చెట్లపైనుండి పక్షులధ్వని ఆగిపోతున్నది. గుడిదగ్గర చేరిన నాగరాజు లైటు క్రిందపెట్టి ఒక నిట్టూర్పు విడిచాడు. నామమాత్రంగా మున్న తలుపులకు చుట్టిన తీగనుతీసి గుడిలో లోపలికి అడుగుపెట్టగానే గబ్బిలాలన్నీ చప్పుడుచేస్తూ లైటుచుట్టూ ముసురుకున్నాయి. నాగరాజు మైనమ్మకు నమస్కారించేసి, పాదాల దగ్గరవున్న ఆకు అలములను తీసివేసి శుభ్రపర్చినాడు. చెయ్యి వెయ్యగానే అమ్మ మెడలోని పూలదండలు చేతిలోకి ఊడివచ్చినాయి. నిన్నటివా మొన్న టివా సంవత్సరం నాటివి. బయట పంపు నుండి నీళ్ళుతెచ్చి విగ్రహాన్ని శుభ్రంగా కడిగి, పెచ్చుపోయినచోటకు రంగులు దిద్ది తెచ్చినవాల చాపను గుడిబయట నున్న బలిపీఠముపైకి ఒంచి, పట్టుతెరను వాకిలికి అడ్డముగా కట్టాడు. నిన్నటిదాక నిద్ర పోతున్న విగ్రహము, యిప్పుడు ప్రళయ తాండవము చేస్తున్నట్లు భయంకరముగా వున్నది.

నాగరాజు అమ్మవారిదగ్గర పూజ చేసు కొని బయటకు వచ్చేసరికి తూర్పున తెల్లవారుతుంది. అప్పుడే వర్తకులు జాతరలో అమ్మటానికి రక రకాల సరుకులతో గుడి చుట్టూతా దుకాణాలు సిద్ధం చేస్తు న్నారు. మాట్లాడకుండా తల వంచుకొని నాగరాజు ఊరివైపుకు సాగిపోయినాడు.

ఎప్పుడూ ప్రశాంతముగా వుండే మైనమ్మ గుడి, ఆ రోజు యిసుకవేస్తే రాలని జనంతో కిట కిట లాడుతున్నది. భక్తులు బయటనుండే తమ ముడుపులను అమ్మకు చెల్లించుకుంటున్నారు రాఘవయ్య దంపతులు బలిపీఠముపై వడ్లు పోయ టంతో, వచ్చిన భక్తులుకూడ బలిపీఠముపై వడ్లు పోయటం మొదలుపెట్టారు. సాయంత్రానికి దాదాపు పది అడుగుల యెత్తున ధాన్యపురాసి నిలబడివున్నది. అందరిని పంపించి, నాగరాజు అమ్మకు ధాన్యపురాశికి అడ్డగావున్న తెరను తొలగించి యింటికి వెళ్ళిపోయినాడు. ఆ రోజు రాత్రి ఊళ్ళో జరుగుతున్న కథ వినటా నికి గ్రామం, గ్రామం అక్కడే కూర్చుని ఉన్నది ఒక్క చొప్పమ్మ తప్ప.

జాతరలో హుషారుగా తిరిగిన రాఘవయ్య సాయంత్రము చొప్పమ్మ దగ్గర సారా దిట్టంగా పట్టించి మైనమ్మను పొంద టానికై చొప్పమ్మ యింట్లో దూరాడు. తల్లితో కథ వినటానికి సిద్ధమవుతున్న మైనమ్మ త్రాగుతూ వస్తున్న రాఘ వయ్యను చూడగానే దిక్కుతోచక దొడ్డి




గుమ్మంలోంచి బయటకు పరిగెత్తింది నిషాలోవున్న రాఘవయ్య ఏ మాత్రం జాగు చెయ్యకుండా వెంబడించాడు. అమ్మ తల్లి దగ్గరకు పోదామనుకుంది ... అడ్డంగా ముళ్ళకంచె వుండడంచేత జాతర జరిగిన వైపుకు పరిగెత్తింది, మానరక్షణ కోసం. కాని అప్పటికే అక్కడ నిశ్శబ్దం తాండవిస్తుంది. మైనమ్మ మొదట గుడి వెనక దాక్కుంది. రాఘవయ్య పచ్చి చుట్టూరా వెతికాడు గాని మైనమ్మ కన పడలేదు. నిషా తలకి ఎక్కుతుంది. ఆడ దాన్ని పొందలేకపోయాననే పౌరుషం గుండెలో రాముకుంటుంది. గుడి వెనుక నున్న మైనమ్మ మెల్లగా బలిపీఠముపై వున్న ధాన్యపు రాశివెనక దాగటానికి పరిగెత్తింది. పాదాల శబ్దం విన్న రాఘ వయ్య మైనమ్మను పట్టుకుందామని, అమ్మవారికి ధాన్యపురాశికి మధ్యగా పరి గెత్తాడు. రెండడుగులు దాటాడో లేదో 'అమ్మో' అంటూ బిగ్గరగా అరుస్తూ నెత్తురు కక్కుకుంటూ ధాన్యపురాశి ముందర పడిపోయ్యాడు. బిత్తరపోయిన మైనమ్మ ఏమి చెయ్యాలో తోచక, మెదలకుండా యింటికి వెళ్ళిపోయింది.

అనాదిగా వస్తున్న ఆపారము ప్రకా రము తెల్లవారేసరికి ధాన్యపురాశి అమ్మ వారి చూపుల వలన మల్లెపువ్వులు లాగా విచ్చుకొని పేలాలు కావలసింది. కాని రాఘవయ్యను బలికొన్న మైనమ్మ ధాన్యపు రాశిని ఏ మాత్రం ముట్టుకొనలేదు.

తెల్లవారిన తర్వాత ప్రసాదం తీసుకు వెళదామని వచ్చిన భక్తులు రక్తం మడు గులో వున్న రాఘవయ్యను చూచి ఆశ్చర్య పడినారు. చెక్కు చెదరని ధాన్యపు రాశిని చూచి ముక్కుమీద వేలేసుకున్నారు.

లక్ష్మమ్మ గుండెలు పగిలేటట్లు ఏడ్చింది. రాఘవయ్యకు సరైన శాస్తి జరిగిందని చొప్పమ్మ సంతోషించింది. రాత్రి సంగతి తెలియని ప్రజలు రాఘవయ్య మరణం గూర్చి అనేక విధాలుగా చెప్పు కోవటం ప్రారంభించారు.

పసుపు కుంకుమ పోగొట్టుకుంది లక్ష్మమ్మ. కన్నెరికం కాపాడుకుంది మైనమ్మ. అన్ని చూస్తున్న వీరాయి మాత్రము మైనమ్మ నిజంగా దేవతే అనుకుంటూ వచ్చిన వాళ్ళలో తాను గూడ కలిసి పోయినాడు. ●